సాక్షి
వికారాబాద్
శనివారం । 1 । జూన్ । 2024



సబ్‌స్టేషన్ 'బ్రేకర్'కు బ్రేక్

ఏడాది క్రితం మొదలు పెట్టిన తొర్మామిడి 33/11 కేవీ సబ్‌స్టేషన్ బ్రేకర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 10లో▸



వెంచర్ ధ్వంసంపై కేసు

వెంచర్‌ను ధ్వంసం చేసిన ఘటనలో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేశారు. 10లో▸



ఘనంగా ఈదమ్మ జాతర

మండల కేంద్రంలో ఈదమ్మ జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11లో▸

న్యూస్‌రీల్

6నుంచి సదరం క్యాంపులు

తాండూరు టౌన్: జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుంచి సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6, 27వ తేదీల్లో తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో అంగవైకల్యంపై, 11, 21వ తేదీల్లో మానసిక వైకల్యం, 29న వినికిడి లోపానికి సంబంధించిన వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. వికారాబాద్‌లోని జీజీహెచ్‌లో ఈ నెల 10, 18, 26 తేదీల్లో అంగవైకల్యం, 11న కంటి చూపునకు సంబంధించిన పరీక్షలు చేయనున్నట్లు వివరించారు. ఈ నెలలో అంగవైకల్యానికి సంబంధించి 350 స్లాట్లు, కంటి చూపునకు 60, వినికిడి లోపం ఉన్న వారికి 60, మానసిక వైకల్యానికి సంబంధించి 120 స్లాట్లు కేటాయించినట్లు తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

జిల్లాస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలు



పతకాలు అందుకున్న విద్యార్థులు

పూడూరు: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన పది మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. పూడూరు మండలం రాకంచర్లకు చెందిన జే వైష్ణవి కలర్ బెల్ట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ బాల్‌రాజ్ ముదిరాజ్ తెలిపారు. వికారాబాద్ జిల్లా నుంచి పది మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. సాత్విక్, అభిషేక్, విష్ణుష్, రిత్విక్, మయాంక్, అనిరుధ్ బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆత్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రెడిషనల్ జపాన్ షోటోకాన్ కరాటే ఫౌండర్ జే శ్రీనివాస్, సెక్రటరీ శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదల

- 6నుంచి వృత్తి సహకార సంఘాలకు ఎన్నికలు
- జిల్లా సహకార శాఖ అధికారి ఈశ్వరయ్య

అనంతగిరి: జిల్లాలో వృత్తి పరమైన సంఘాలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా సహకార శాఖ అధికారి ఈశ్వరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎన్నికల ప్రతిపాదనలు అందాయని, ఇందులో 22 గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల నుంచి, 10 కల్లు గీత కార్మిక సంఘాల నుంచి, 7 మత్స్య సహకార సంఘాల నుంచి, మరొక సంఘం నుంచి ఎన్నికలు జరపాలని ప్రతిపాదనలు వచ్చినట్లు వివరించారు. శుక్రవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందన్నారు. జూన్ 6 నుంచి 28వ తేదీ వరకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ ఎన్నికలను అసిస్టెంట్ రిజిస్ట్రార్ జే చంద్రయ్య, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ అజ్మత్ పాషా, జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎస్ నాగశివకుమారి పర్యవేక్షిస్తారని వివరించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్: జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో డీఈఓ రేణుకాదేవికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా పదోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు లేవన్నారు. కొంత మంది ఉపాధ్యాయులు 14 ఏళ్లుగా ఒకే పాఠశాలలో పనిచేస్తున్నారని తెలిపారు. జూన్ 12వ తేదీ లోపు పదోన్నతులు, బదిలీలు పూర్తి చేయాలని కోరారు. 317 జీవో వల్ల కొందరికి నష్టం జరిగిందన్నారు. జూన్ 4వ తేదీ తర్వాత ఎన్నికల కోడ్ ముగుస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఉపాధ్యాయులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా వేసవి సెలవుల్లో పని చేసిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విత్తన సమస్య లేనట్లే

వికారాబాద్ డివిజన్‌లో పత్తి సాగు అంచనా 1.21 లక్షల ఎకరాలు

అధికారుల ముందస్తు చర్యలతో రైతులు విత్తన సమస్య నుంచి బయట పడినట్లే కనిపిస్తోంది. మరో వారం రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్నదాతలు సాగు పనుల్లో బిజీ అయ్యారు. ఎరువులు, విత్తనాల కొనుగోలు తోపాటు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. పొరుగు జిల్లాల్లో విత్తన సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో జిల్లాలో అధికారులు తీసుకుంటున్న చర్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- అవసరమైన 2.42 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు
- అందుబాటులో 1.80 లక్షల ప్యాకెట్లు
- మొక్కజొన్న సాగు విస్తీర్ణం 16,546 ఎకరాలు

వికారాబాద్: వానాకాలం సీజన్ సమీపిస్తుండటంతో విత్తనాల కొరత ఉత్పన్నం కాకుండా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు విత్తన పంపిణీపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అయితే ఒకటి రెండు రకాల విత్తనాలు తప్ప ఎలాంటి కొరత లేదని స్పష్టమవుతోంది. డిమాండ్ ఉన్న విత్తనాలను దుకాణాదారులు బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పత్తి, మొక్కజొన్న, కంది విత్తనాలను రైతులు దుకాణాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మిగతా పంటలు వేసే రైతులు సొంతంగా విత్తనాలను సమకూర్చుకుంటున్నారు. వికారాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈ ఏడాది 1.21లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. 2.42 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయని గుర్తించారు. 1.80 లక్షల ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు రైతులు 15వేల ప్యాకెట్లను మాత్రమే కొనుగోలు చేశారు. వర్షాలు పడితే డిమాండ్ ఏ మేరకు ఉంటుందో గాని తెలియదు. 16,546 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయనుండగా 1.20 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం 30 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచారు. 5 క్వింటాళ్లను రైతులు కొనుగోలు చేశారు.

జిల్లాకు సరిపడా విత్తనాలు

జిల్లాలో సాగుకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఆందోళనకు గురికావాల్సిన పని లేదు. డబుల్ బీటీ పత్తి విత్తనాలు అందుబాటులో ఉంచాం. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే విత్తనాలన్నీ శాస్త్రవేత్తలు ధ్రువీకరించినవే. డిమాండ్ ఉన్న విత్తనాలను కూడా అందుబాటులో ఉంచుతాం.

– గోపాల్, డీఏఓ



ఆలంపల్లి ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రైతులను మోసం చేస్తే పీడీ యాక్ట్

కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. శుక్రవారం వికారాబాద్ పరిధిలోని ఆలంపల్లి వద్ద గల ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. నకిలీ, కల్తీ విత్తనాలను కట్టడి చేస్తామన్నారు. జిల్లాలో ఈ ఏడు 2లక్షల 63వేల హెక్టార్లలో పత్తి సాగు చేస్తారని, 5లక్షల 42 వేల విత్తన ప్యాకెట్లు అవసరం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం 3లక్షల 12వేల ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో విత్తనా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అవసరం మేరకు విత్తనాలను అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్య వచ్చినా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అధికారులు రైతు సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించాలన్నారు. వారికి సందేహాలు ఉంటే నివృత్తి చేయాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాల యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. డీలర్లు విత్తన చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని ఆదేశించారు. స్టాక్ వివరాలను బోర్డు, రిజిస్టర్ విధిగా నమోదు చేయాలన్నారు. విత్తనాలు కొన్న రైతులకు తప్పని సరిగా రసీదులు ఇవ్వాలని దుకాణాదారులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శాఖ జిల్లా గోపాల్, ఏఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు



విత్తనాలు కొనుగోలు చేసేందుకు వచ్చిన రైతులు

తాండూరు: నియోజకవర్గంలో సాగుకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాంతంలో ప్రధానంగా పత్తి, కంది, మొక్కజొన్న, సోయ, మినుము, పెసర వంటి పంటలు సాగు చేస్తారు. పత్తి విత్తనాల కొరత ఉందనే ప్రచారం జరుగుతున్నా అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. తాండూరు ప్రాంతంలో నల్లరేగడి నేలలు అధికంగా ఉన్నాయి. వర్షాధార పంటలైన పత్తి, కంది, పెసరు, మినుము, మొక్కజొన్న పంటలు సాగు చేస్తారు. వర్షాలు పడగానే సాగు పనులు ప్రారంభించేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నారు. డిమాండ్‌కు తగ్గట్లు పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచారు. తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. గతంలో వ్యవసాయ శాఖ సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసేది. ప్రస్తుతం జనుము విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉంచింది. జీలుగ విత్తనాల కొరత నెలకొంది. కంది, పెసర, మినుము విత్తనాల పంపిణీపై వ్యవసాయశాఖ అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు.



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌కుమార్

వసతులు కల్పించండి

- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను వేగవంతం చేయండి
- మున్సిపల్ ప్రత్యేక అధికారి వినయ్‌కుమార్

తాండూరు: మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి వినయ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను ఈ నెల 5వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలోని 25 స్కూళ్లను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేశామన్నారు. వీటిలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. కోటి మంజూరు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తి చేశామని, పాఠశాలల ప్రారంభం నాటికి ఏ ఒక్క పని పెండింగ్‌లో ఉండరాదని ఆదేశించారు. పాఠశాలల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. త్వరలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున భవనాలు లీకేజీలు కాకుండా చూసుకోవాలని, అవసరం ఉన్న చోట మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. డిజిటల్ బోధనకు అనుకూలంగా ఉండేలా పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు అనువైన వాతావరణం కల్పించాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

షాద్‌నగర్: ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎన్‌పీఆర్‌డీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమల్లోకి వచ్చి ఎనిమిదేళ్లు అవుతున్నా నేటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. ప్రత్యేక అలవెన్సులను అందించడం లేదని, దివ్యాంగుల సంక్షేమానికి పాటు పడటం లేదని విమర్శించారు. ప్రతి జిల్లా కేంద్రంలో మానసిక దివ్యాంగుల కోసం ప్రత్యేక హోమ్స్‌ను నిర్మించాలని, కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందజేస్తున్న రూ.300 పెన్షన్ పెంచాలని, కేంద్ర ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, దివ్యాంగులపై వేధింపులు, దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్ల సాధనలో భాగంగా జూలై 23, 24 తేదీల్లో జిల్లా తృతీయ మహాసభలను షాద్‌నగర్ పట్టణంలో జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ డివిజన్ ఎన్‌పీఆర్‌డీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా నర్సింలు, గౌసియా బేగం, శివలీల, కార్యదర్శిగా సంతోష, సహాయ కార్యదర్శులుగా శివరాములు, కల్పన, కుసుమ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌గౌడ్, నాగార్జున, శ్రీనివాస్, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

గ్రూప్‌-1కు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. జూన్ 9న జరిగే పరీక్షపై శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి తప్పిదాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించాలన్నారు. జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 5,468 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. వికారాబాద్‌లో 7, తాండూరులో 4, పరిగిలో 2 కేంద్రాలు ఉంటాయన్నారు. వీటిలో మౌలిక వసతులు, ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, మరుగుదొడ్లు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద అత్యవసర మందులు, వైద్య సిబ్బంది ఉండాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని ఆదేశించారు. టీఎస్ పీఎస్సీ మార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్ష నిర్వహించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష పత్రాలను కేంద్రాలకు తరలించాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, గ్రూప్‌–1 రీజినల్ కోఆర్డినేటర్ డా.రాజేష్, కలెక్టరేట్ పరిపాలన విభాగం అధికారి అమరేందర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు రహదారి

- హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- సిగ్నల్స్ వ్యవస్థ లేకపోవడమే కారణం
- మృత్యువాత పడుతున్న ప్రయాణికులు
- చోద్యం చూస్తున్న అధికారులు



తుంకిమెట్ల సమీపంలో ప్రమాదానికి గురైన లారీ

కొడంగల్: హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో ప్రమాదాల నివారణకు పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసినా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. హైదరాబాద్ – కర్ణాటక రాష్ట్రాల మధ్య నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డుకు ఇరువైపులా సిగ్నల్స్ వ్యవస్థ లేకపోవడంతో అతివేగంగా వచ్చే వాహనాలను డ్రైవర్లు అదుపు చేయడం కష్టంగా మారింది. పలు గ్రామాల వద్ద రోడ్డు పెద్దగా ఉన్నా మధ్యలో డివైడర్లు వేశారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరి కొన్ని చోట్ల డివైడర్లు ఇరుగ్గా ఉండడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రహదారి నిర్మాణం చేపట్టి పదేళ్లు అవుతున్నా ప్రమాదాల నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాహనచోదకులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్ నుంచి కొడంగల్ వరకు రెండు చోట్ల హైవే పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్లకు సిబ్బందిని కేటాయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దు వరకు ఉన్న రోడ్డుపై ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం హైవే పోలీస్‌స్టేషన్లను మంజూరు చేసింది. మన్నెగూడ సమీపంలో చెంగోమోల్ దగ్గర ఒకటి, కొడంగల్ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో మరొక హైవే పోలీస్‌స్టేషన్ నిర్మించారు. హైదరాబాద్ నుంచి మొయినాబాద్, చేవెళ్ల, మన్నెగూడ, పరిగి, కొడంగల్, గుర్మిటకల్, యాద్గిర్, ముదేబిహాల్, బాగల్‌కోట్, బీజాపూర్ వరకు జాతీయ రహదారి ఉంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లడానికి కర్ణాటక మంత్రులు, అధికారులు ఈ మార్గం గుండానే వస్తున్నారు. సేడం, గుర్మిటకల్, యాద్గిర్, బాగల్‌కోట్, ముదేబిహాల్, బీజాపూర్, గుల్బర్గా, సుర్‌పూర్, షాపూర్ వాసులు వారి అవసరాల కోసం ఈ రోడ్డుపైనే హైదరాబాద్‌కు వస్తున్నారు. ఇంత రద్దీ ఉన్న జాతీయ రహదారిపై అధికారుల నిఘా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఎంసీ రోడ్డుదీ ఇదే పరిస్థితి

మహబూబ్‌నగర్ – చించోలి (ఎంసీ రోడ్డు) అంతర్రాష్ట్ర రహదారిని కేంద్ర ప్రభుత్వం ఇటీవల జాతీయ రహదారిగా మార్చింది. మహబూబ్‌నగర్, కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా చించోలీ మన్నాకెళ్లి వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. మహబూబ్‌నగర్ నుంచి వికారాబాద్ జిల్లా పరిధిలోని దుద్యాల వరకు ఒక మోస్తరుగా పనులు జరిగాయి. దుద్యాల నుంచి తాండూరు మీదుగా చించోలీ వరకు పనులు చేయాల్సి ఉంది. అయితే పట్టణంలోని వినాయక చౌరస్తా విస్తరణకు నోచుకోవడం లేదు. గతంలో పలుమార్లు పనులు చేపట్టినా ముందుకు సాగలేదు. దీంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఆర్టీసీ బస్సులు అక్కడే ఆగుతున్నాయి. పాఠశాలలు, కళాశాలలు అక్కడే ఉండడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి రోజూ ఈ మార్గంలో వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయి. వినాయక చౌరస్తాను విస్తరిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని స్థానికులు అంటున్నారు.

క్లుప్తంగా

'ఆ జీఓను రద్దు చేయాలి'

అనంతగిరి: విద్యాశాఖ విడుదుల చేసిన 11143ను ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, కార్యదర్శి కమాల్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సైన్స్ ఉపాధ్యాయులు ఆరు, ఏడు తరగతులకు గణితం చెప్పించడం సరికాదన్నారు. ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ నియామక అర్హతలో గణితం బోధించాలనే నిబంధన లేదని గుర్తు చేశారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకన్నా గణితోపాధ్యాయులే 20శాతం ఎక్కువగా ఉన్నారన్నారు. ప్రభుత్వం పునరాలోచించి న్యాయం చేయాలని కోరారు.

ఆశవర్కర్లకు పరీక్ష వద్దు

యూనియన్ అధ్యక్షురాలు మాధవి

అనంతగిరి: ప్రభుత్వం ఆశవర్కర్లకు పరీక్ష పెట్టే నిర్ణయాన్ని విరమించుకోవాలని యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షురాలు మాధవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె సంఘం సభ్యులతో కలిసి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. చదువుకున్న వారికి, సీనియార్టీ ఉన్నవారికి ప్రమోషన్లు ఇచ్చి కనీస వేతం రూ.18వేలకు పెంచాలని కోరారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించి రూ.పది లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్, రూ.50లక్షల ఇన్సూరెన్స్ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్, శ్రీనివాస్, ఉమాదేవి, చంద్రకళ, పద్మ, యశోద, అరుణ, పుష్ప, అండాలు, సర్సమ్మ, భారతి, మంగమ్మ, అనసూయ, రేణుక తదితరులున్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో బొప్పనారం సింగర్



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సలావుద్దీన్

బంట్వారం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలను నగరంలోని త్యాగరాయ గాన సభలో నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ ఉత్సవాల్లో వందలాది మంది కళాకారులు ఏకదాటిగా జానపద గేయాలను ఆలపించారు. ఈ సందర్భంగా బొప్పనారం గ్రామానికి చెందిన డాక్టర్ సలావుద్దీన్ అలియాస్ సలీంకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించింది. అనంతరం ఎక్సలెన్స్ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మ శ్రీ అవార్డు గ్రహీతలు కొలకలూరి ఇనాక్, డాక్టర్ వేణు ఆనందాచారి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. నలుగురికి గాయాలు



బోల్తాపడిన ట్రాక్టర్

దౌల్తాబాద్: ట్రాక్టర్ బోల్తాపడి నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని యాంకి సమీపంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మామిడికుంట తండాలో ఉదయం ఉపాధి కూలీలతో చెరువుమట్టి పూడిక తీస్తున్నారు. మట్టి తరలించేందుకు వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ఉన్న చిన్నదేవిబాయి, పెద్ద దేవిబాయి, కమిలిబాయి, అమ్లీబాయి కిందపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన పెద్దదేవిబాయిని మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురు కొడంగల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

సబ్‌స్టేషన్ 'బ్రేకర్'కు బ్రేక్

- ఏడాది కాలంగా నిలిచిన పనులు
- స్తంభాలు నాటి వైరింగ్ వదిలేశారు
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు
- సమస్య పరిష్కరిస్తామంటున్న ట్రాన్స్‌కో ఏఈ రంగారెడ్డి

బంట్వారం: ఏడాది క్రితం మొదలు పెట్టిన తొర్మామిడి 33/11 కేవీ సబ్‌స్టేషన్ బ్రేకర్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. తొర్మామిడి సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరాకు లోడ్ ఎక్కువ అవ్వడంతో బస్వాపూర్‌కు ప్రత్యేకంగా బ్రేకర్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అప్పటి అధికారులు ఇందుకు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. కాంట్రాక్టర్ సైతం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో స్తంభాలు నాటించారు. నేటికీ వైరింగ్ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. బస్వాపూర్ పరిధిలోని డొమెస్టిక్, అగ్రికల్చర్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్రేకర్ నిర్మాణం పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. దీంతో తొర్మామిడి సబ్ స్టేషన్‌పై భారం ఎక్కువై తరచూ కరెంటు ట్రిప్ అవుతోంది. ఈ క్రమంలో వినియోగదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రంగారెడ్డిని సంప్రదించగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తి చేయిస్తామన్నారు.



ఏడాది క్రితం నాటిన విద్యుత్ స్తంభాలు

త్వరగా పూర్తి చేయాలి



బ్రేకర్ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలి. ఏడాది క్రితం స్తంభాలు నాటి వదిలేశారు. వైరింగ్ పనులు నిలిచిపోయాయి. తొర్మామిడి సబ్ స్టేషన్‌పై లోడింగ్ ఎక్కువై తరచూ కరెంటు ట్రిప్ అవుతూనే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– మోహన్‌రెడ్డి, బస్వాపూర్

రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

ఎర్రగడ్డ స్టోర్‌లో మెటీరియల్ కొరత ఉండడంతో పనులు నిలిచాయి. మెటీరియల్ తీసుకునేందుకు అధికారుల నుంచి అనుమతులు వచ్చాయి. బస్వాపూర్‌లో డొమెస్టిక్, అగ్రికల్చర్‌కు ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా ఉంటుంది. కరెంట్ ట్రిప్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– సిద్దిక్, కాంట్రాక్టర్

తప్పనిసరైతేనే సిజేరియన్లు

అనవసరంగా ఆపరేషన్లు చేస్తే చర్యలు

- సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి
- మదర్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ సాయిబాబా

తాండూరు: గర్భిణులకు తప్పనిసరైతేనే సిజేరియన్స్ చేయాలని.. అనవసరంగా ఆపరేషన్లు చేస్తున్న గైనకాలజిస్టులు, ప్రైవేట్ ఆస్పత్రులపై ఆరోగ్యశాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని మదర్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ సాయిబాబా హెచ్చరించారు. డీఎంహెచ్ఓ పల్వన్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం మదర్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం జిల్లా అధికారులు సాయిబాబా, శ్రీనివాసులు పట్టణంలోని శివ నర్సింగ్ హోంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు నెలలుగా చేసిన ప్రసవాలపై ఆరాతీశారు. అనంతరం ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. రెండు నెలలుగా చేసిన 56 ప్రసవాలలో తొమ్మిది సాధారణ ప్రసవాలు, 47 మందికి సిజేరియన్స్ చేసినట్లు గుర్తించారు. ఎక్కువగా సిజేరియన్స్ చేయడానికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం కేస్ షీట్లను పరిశీలించారు. రిపోర్టులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని ఆస్పత్రి యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిబాబా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మళ్లీ సీజిరియన్ ప్రసవాలు పెరుగుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ గుర్తించిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రైవేటు ఆస్పత్రులు తప్పనిసరిగా సాధారణ ప్రసవాలు చేయాలన్నారు.



శివనర్సింగ్ హోంలో రికార్డులను తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

బీడీ లీఫ్ బోనస్ డబ్బులు పక్కదారి?

- అటవీ శాఖ అధికారుల చేతివాటం
- కూలీలకు దక్కాల్సిన డబ్బులు స్వాహా

ధారూరు: బీడీ లీఫ్ (తునికాకు సేకరణ) పథకంలో భాగంగా కూలీలకు దక్కాల్సిన బోనస్ డబ్బులు పక్కదారి పడుతున్నాయి. ధారూరు ఫారెస్టు రేంజ్‌లో ఈ అక్రమాలు బాహాటంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు చెలరేగాయి. ఈసారి పనులు చేసిన కూలీలకు బోనస్ కింద మరుసటి ఏడాది కొంత మొత్తం చెల్లిస్తారు. ఈ డబ్బులను కూలీలకు తెలియకుండా అధికారులు నొక్కేస్తున్నారు. ఇటీవల కూలీలకు వచ్చిన గతేడాది బోనస్ డబ్బులు రూ.3.75 చాకచక్యంగా మింగేశారు. ధారూరు మండలానికి చెందిన కొంతభాగం అడవి.. వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్‌లో ఉంది. వికారాబాద్ రేంజ్‌లో పనిచేస్తున్న ఓ మహిళా అధికారి కూలీల బోనస్ డబ్బులను స్వాహా చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ధారూరు మండలం తరిగోపుల బీడీఎఫ్ యూనిట్‌లోని కూలీలకు మంజూరైన మొత్తాన్ని.. అటవీశాఖ జిల్లా కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు సమాచారం. డ్రైవర్ చనిపోవడంతో అతని భార్యకు అసలు విషయం చెప్పకుండా.. పొరపాటున మీ భర్త ఖాతాలో మా శాఖకు సంబంధించిన డబ్బులు వేశామని నమ్మించి.. నగదును డ్రా చేయించి తీసుకెళ్లింది. ఈ సమయంలో ఆమెకు కూడా కొంత నగదు ముట్టజెప్పినట్లు తెలిసింది.

ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి

డీఈ హన్మంతు

కుల్కచర్ల: పాఠశాలలు తెరుచుకునే నాటికి ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పాఠశాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని పంచాయతీ రాజ్ డీఈ హన్మంతు అన్నారు. శుక్రవారం ఆయన చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధికి జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతుందన్నారు. ఆయన వెంట మరికల్ జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, సీఆర్పీ విజయ్ కుమార్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న డీఈ హన్మంతు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులతో హన్మంత్‌రావు

జిల్లా క్రీడాధికారి హన్మంత్‌రావు

పరిగి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా క్రీడాధికారి హన్మంత్‌రావు సూచించారు. మండల పరిధిలోని మిట్టకోడూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం తైక్వాండో క్రీడలకు వేసవి శిబిరం ఏర్పాటు చేసింది. ఈ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ బుగ్గయ్య, వెంకటేశ్, విజయ్‌కుమార్, దేవరాజు, దివ్య తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్

యువకుడి రిమాండ్

తాండూరు రూరల్: బాలికను కిడ్నాప్ చేసి అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన కరన్ కోట్ పోలీస్టేషన్ పరిధిలోని సంగెంకలాన్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ మైనర్‌ను గ్రామానికి చెందిన వడ్డె వీరేశం ఈ నెల 22న కిడ్నాప్ చేశారు. బాలిక తండ్రి భీంరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. అదే గ్రామానికి చెందిన వడ్డే వీరేశంగా గుర్తించి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

నాలాలో పడి వృద్ధుడి దుర్మరణం

శంకర్‌పల్లి: చెత్త పారబోయడానికి వెళ్లిన ఓ వృద్ధుడు నాలాలో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జన్వాడ గ్రామానికి చెందిన నాంపల్లి మల్కయ్య(60) వృద్ధాప్యం దృష్ట్యా ఇంటి వద్దనే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం చెత్త పారబోయడానికి ఆయన బయటకి వెళ్లాడు. ఇంటి పక్కనే ఉన్న ఫిరంగి నాలాలో ప్రమాదవశాత్తు కాలు జారి నాలాలో మల్కయ్య పడ్డాడు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతకగా.. మధ్యాహ్నం ఫిరంగి నాలాలో శవమై తేలాడు. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పహాడీషరీఫ్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి కమాన్ రోడ్డులోని ఆక్సిజన్ కంపెనీ సమీపంలో గురువారం సాయంత్రం స్థానికులు ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండడాన్ని గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించగా మృతిచెంది ఉన్నాడు. మృతుడి వయసు 45 ఏళ్లుగా ఉంటుందని, స్థానికంగా భిక్షాటన చేసేవాడని తెలిసింది. సకాలంలో తినకపోవడంతోనే అనారోగ్యం బారిన పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సంబంధీకులెవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురిపై కేసు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ గురునాయుడు, ఎస్ఐ వెంకటయ్య ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను నిలిపి తనిఖీలు చేశారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఓటు వేసేందుకు వెళ్లి మహిళ అదృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్: ఓటు వేసేందుకు సొంతూరుకు వెళ్తొస్తానని చెప్పి ఇంట్లోంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్ మండలం రాణీపేటకు చెందిన వడాల చందన(32) కొన్నేళ్ల క్రితం స్థానికంగా జేఎన్‌ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసముంటూ లేడీస్ కార్నర్ షాపును నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గత నెల 13వ తేదీన సొంతూరు రాణిపేటలో ఓటు వేసేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లారు. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే సంతృప్తి



ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్

కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: ప్రతీ ఉద్యోగి నిబద్ధత, అంకిత భావంతో పనిచేస్తేనే మనసుకు సంతృప్తి కలుగుతుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ పి.అనిల్‌కుమార్, మైనార్టీ సంక్షేమ జిల్లా అధికారి డి.సుధారాణిని శుక్రవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు నిజాయతీ, పారదర్శకతతో పనిచేయాలన్నారు. మనం చేసిన సేవలే జీవితాంతం చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. పదవీవిరమణ పొందిన అధికారులు సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఇద్దరు అధికారులను జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు జ్ఞాపికలు, పుష్ప గుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్సీ డీడబ్ల్యూఓ మల్లేశం, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేశ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్, డీవైఎస్ఓ హన్మంత్ రావు, డీబీసీడబ్ల్యూఓ ఉపేందర్, జిల్లా ఆడిట్ అధికారి వీరభద్ర, డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి చరితారెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేశ్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల కేసులో ఐదుగురికి రిమాండ్

మాడ్గుల: రైతులను లక్ష్యంగా చేసుకొని నకిలీ విత్తనాలు విక్రయించి కాసులు దండుకొనే ముఠాపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. మండలంలోని కొత్త బ్రాహ్మణపల్లిలో బుధవారం నకిలీ విత్తనాలు పట్టుబడిన కేసుకు సంబంధించి మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని.. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని సీఐ విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారం వెల్లడించారు. కొత్త బ్రాహ్మణపల్లి గ్రామంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం శంషాబాద్ ఎస్ఓటీ బృందం, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెయ్యి కిలోల పత్తి విత్తనాలు, ఐదు సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రిక్ కాంటా, ఓ కారును స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన దుగ్గిపూడి మల్రెడ్డి, అల్లం వినోద్‌కుమార్, అల్లం మల్రెడ్డిని అరెస్టు చేశారు. ఈ విత్తనాలు సరఫరా చేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన వైఎస్ సత్యపాల్‌రెడ్డి, కేశంపేట మండలం సుందరాపూర్ గ్రామానికి చెందిన మల్లారెడ్డిలను గురువారం అరెస్టు చేశామన్నారు. కర్ణాటకకు చెందిన కొండపు నాయుడు పరారీలో ఉన్నారని చెప్పారు.



పోలీసులు పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు

ఆత్మహత్యలు సరికాదు



కీర్తి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి ఆత్మహత్యలకు పరిష్కారం కాదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని రైతు కాలనీలో నివాసం ఉంటున్న డాక్టర్ బుచ్చిబాబు, అమృత దంపతుల కుమార్తె కీర్తి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజు, రాజుగౌడ్, అర్జున్‌కుమార్, లింగం తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పించిన ధన్వంతరీ గ్రామీణ వైద్యుల సంఘం

వైద్యవృత్తిని చదువుతున్న కీర్తి ఆత్మహత్య చేసుకోవడంతో ధన్వంతరీ గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు రఘుపతినాయక్ ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. పట్టణంలోని చౌరస్తాలో కీర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు రంగయ్య, రాచప్ప, రవికుమార్, తిరుపతి, పద్మనాభం, యాదగిరి, ఆంజనేయులు, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

వెంచర్ ధ్వంసంపై కేసు

- ప్లాట్ల కబ్జాకు యత్నం
- వాహనాలు సీజ్

నందిగామ: వెంచర్‌ను ధ్వంసం చేసిన పలువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు వాహనాలను సీజ్ చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని రంగాపూర్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. 2006లో రంగాపూర్ శివారు 320, 322, 324, 331 సర్వే నంబర్లతో పాటు మరికొన్ని భూములను కలిపి మెట్రోసిటీ పేరుతో గ్రీన్ హోం ఫామ్స్ అండ్ రిసార్ట్స్ హైదరాబాద్ సంస్థ సుమారు 100 ఎకరాలలో వెంచర్ వేసింది. రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లికి చెందిన యర్రగుంట్ల పాపయ్య వెంచర్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. పెద్దమ్మ తండాకు చెందిన దేవేందర్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం దేవేందర్ వెంచర్ వద్దకు వెళ్లగా.. నాలుగు జేసీబీలు, నాలుగు డోజర్లు సుమారు రెండు ఎకరాల్లో ప్లాట్లను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో వెంటనే ఆయన సూపర్‌వైజర్ పాపయ్యకు సమాచారం ఇవ్వడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని రెండు జేసీబీలను, రెండు డోజర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. పాపయ్య ఫిర్యాదు మేరకు హాజీపల్లికి చెందిన దర్శన్‌తో పాటు రంగాపూర్‌కు చెందిన హనుమంత్‌రావు, విజయ్, చెన్నకేశవులుతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.



పోలీసులు సీజ్ చేసిన జేసీబీలు, డోజర్లు

గంజాయి విక్రేతలకు రిమాండ్

చేవెళ్ల: గంజాయి అమ్మేందుకు వెళ్తున్న ఇద్దరు వలస కూలీలను శుక్రవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ వీరబ్రహ్మం తెలిపిన ప్రకారం.. గురువారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎస్ఓటీ పోలీసులకు అందించిన పక్కా సమాచారం అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేశారు. వారి వద్ద 730 గ్రాముల గంజాయి పాకెట్లు లభించాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన నహీర్‌మియా, నూర్ ఇస్లాం కూలి పనులు చేస్తూ చేవెళ్లలో అద్దెకుంటున్నారు. వీరు గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి తెలిసినవారికి అమ్మేందుకు వెళ్తున్నట్లు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



పోలీసుల అదుపులో వలసకూలీలు